




www.vibharenews.com

# విభారె

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY








PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి ఆదివారం 14-05-2023 సంపుటి : 04 సంచిక : 226 పేజీలు : 4 వెల : రూ 3-00


# కర్నాటకలో కాంగ్రెస్ హవా



బెంగళూరు,మే13 : కర్ణాటక ఎన్నికల ఫలితాల్లో కాంగ్రెస్ హవా స్పష్టంగా కనిపించింది. వెలువడుతున్న ఫలితాలు కాంగ్రెస్‌ను అధికారం వైపు తీసుకెళుతున్నా యి. ఇప్పటి వరకు వెలువడిన ఫలితాల ప్రకారం.. కాంగ్రెస్ పార్టీ ముందంజలో కొనసాగుతోంది .అవినీతిలో కూరుకుపోయిన అధికార బీజేపీకి కన్నడ ఓటర్లు షాకిచ్చారు. శనివారం వెలువడు తున్న కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో బీజేపీకి మొదటి నుంచి ఎదురుగాలి వీస్తోంది. స్పష్టమైన ఆధిక్యంలోకి రాలేకపోతోం ది. ఓటమి అంచుల్లో కూరుకు పోయింది. ఇప్పటి వరకు 72 స్థానాల్లో ముందంజలో ఉండగా.. ఒక్క స్థానంలో మాత్రమే గెలుపొం దింది. ఓట్ల లెక్కింపు ప్రారంభమై నప్పటి నుంచి కాంగ్రెస్ పార్టీ స్పష్టమైన ఆధిక్యంలో దూసుకెళ్తోం ది. ఇప్పటి వరకు వెలువడిన ఫలితాల ప్రకారం.. 224 స్థానాలకు గానూ కాంగ్రెస్ పార్టీ 121 స్థానాల్లో ముందంజలో ఉండగా.. మూడు స్థానాల్లో విజయం సాధించింది. రాష్ట్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలంటే మేజిక్‌ఫిగర్113 అన్న విషయం తెలిసిందే. 113 స్థానాలు దాటి ఏ పార్టీ అయినా విజయం సాధిస్తే.. సొంతంగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకోవచ్చు. ఈ నేపథ్యంలో ప్రస్తుతం వెలువడుతున్న ఫలితాలను బట్టి రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తు న్నాయి. అధికార బిజెపి వందలోపు స్థానాలతో రెండోస్థానంలో ఉండబోతోంది. జెడిఎస్‌తో కలిసినా అధికారం ఏర్పాటు చేసే అవకాశం లేకుండా పోయింది. ఎన్నికల్లో సర్వేలు చెప్పిందే నిజమవుతు న్నాయి. రాష్ట్రంలో బీజేపీ అధికారం కోల్పోవడం ఖాయమయ్యింది

**అధికారం దిశగా అడుగులు**

**స్పష్టమైన మెజార్టీ దిశగా దూకుడు**

**మేజిక్ ఫిగర్‌ను దాటి పలుచోట్ల ఆధిక్యం**

**సొంతంగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేలా ఫలితాలు**

**సిఎంగా ఎవర్న దానిపై అప్పుడే చర్చలు**

**సిద్దరామయ్య, డికె శివకుమార్‌ల మధ్యే పోటీ**



.మరోవైపు ఇప్పటి వరకు వెలువడిన ప్రాంతీయ, జాతీయ మీడియా సర్వేలు, ఇతర సంస్థలు నిర్వహించిన సర్వేలు ఏ ఒక్కటీ కూడా బీజేపీ తిరిగి అధికారంలోకి వస్తుందని చెప్పలేదు. తాజా పరిస్థితులు చూస్తుంటే అదే నిజమనిపిస్తోంది. మరోవైపు కర్ణాటకలో గెలిస్తే దక్షిణాదిలో పాగా వేయొచ్చని భావించిన బీజేపీకి ఈ ఎన్నికలు చెంపపెట్టే. ఈ సారి కూడా రాష్ట్రంలో ఎలాగైనా పాగా వేయాలన్న కమలం పార్టీ కలలను ప్రజలు పటాపంచలు చేశారు. అగ్రనేతలు రాష్ట్ర పర్యటనలు చేస్తూ కన్నడ ప్రజలను తమవైపుకు తిప్పుకునే ప్రయత్నం చేశారు. ఎన్నికల సందర్భంగా ప్రధాని మోదీ ఏకంగా నాలుగు నెలల్లోనే 9 సార్లు కర్ణాటకలో పర్యటించారు. బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, పార్టీ అగ్రనేత, కేంద్ర హోం మంత్రి అమిత్ షా కర్ణాటక చుట్టూ ప్రదక్షిణ లు చేశారు. మరోవైపు ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని కమలం పార్టీ బడ్జెట్ కేటాయింపులో కర్ణాటకకు అధిక ప్రాధాన్యం ఇచ్చింది.

# మతం చూడం.. కులం చూడం.. అదే సిసలైన లౌకికవాదం: ప్రధాని మోదీ



గాంధీనగర్: అసలైన లౌకికవాదం అంటే.. తన దృష్టిలో వివక్ష లేకపోవడమేనని గుజరాత్ పర్యటనలో దేశ ప్రధాని నరేంద్ర మోదీ స్పష్టం చేశారు.సామాజిక న్యాయం గురించి మాట్లాడే వారికి నేను చెప్పదల్చుకుంది ఒక్కటే. ప్రజల సంతోషం, వాళ్ల సౌలభ్యం.. పూర్తిస్థాయి హక్కుల కోసం పని చేయడం కన్నా గొప్ప సామాజిక న్యాయం మరొకటి లేదని తాను భావిస్తున్నానని చెప్పారు. ప్రస్తుతం దేశం కూడా అదే తోవలో పయనిస్తోందని అన్నారాయనశని వారం గాంధీనగర్(గుజరాత్) మహాత్మా మందిర్‌లో సుమారు 4 వేల కోట్ల రూపాయలకుపైగా ప్రాజెక్టులకు ప్రధాని నరేంద్ర మోదీ శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన ప్రసంగిస్తూ.. సంక్షేమం అందించడంలో తన ప్రభుత్వం పక్షపాతం లేకుండా వ్యవహరిస్తుందని చెప్పారు. నా దృష్టిలో సెక్యు లరిజం అంటే.. వివక్ష లేకపోవ డమే. అందుకే కులం, మతం అనే పట్టింపు లేకుండా వివిధ పథకాల రూపంలో లబ్ధిదారులకు సంక్షేమ ఫలాలను మా ప్రభుత్వం అంది స్తోంది. ఇలా అందరి సంతోషం, సౌలభ్యం కోసం పని చేసినప్పుడు.. అంతకు మించిన సామాజిక న్యా యం మరొకటి ఉండబోదని చెప్పా రాయన .ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద.. గుజరాత్‌లో నిర్మిస్తున్న నివాస సముదాయాలకు శంకుస్థాపన చేశారాయన. ఈ పథకం కింద.. పేదల కోసం నాలుగు కోట్ల నివాసాలు నిర్మించామని, అందులో 70 శాతం నివాసాలను మహిళలకు అందజేయడం ద్వారా మహిళా సాధికారికతను చాటామని తెలిపారాయన.

# కర్నాటక బిజెపి తప్పులే కొంప ముంచాయి

**తప్పులు సరిదిద్దుకుని ముందుకు వెళతాం: కిషన్ రెడ్డి**

హైదరాబాద్,మే13 : కర్ణాటకలో అక్కడి బిజెపి ప్రభుత్వం చేసిన తప్పులే బీజేపీని ముంచాయని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. కర్ణాటకలో బీజేపీ ఓటమిపై కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి స్పందించారు. కర్ణాటకలో బీజేపీ ప్రభుత్వం చేసిన పొరపాట్లు కారణంగానే తాము ఓడిపోయామని చెప్పారు. కర్ణాటకలో బీజేపీ ఒక తప్పు చేస్తే.. తెలంగాణలో బీఆర్ఎస్ వంద తప్పులు చేసిందన్నారు. రానున్న ఎన్నికల్లో తెలంగాణలో బీఆర్ఎస్‌కు వ్యతిరేకంగా ప్రజలు ఓట్లు వేస్తారని తెలిపారు. కర్ణాటక ప్రజల తీర్పును శిరసా వహిస్తామన్నారు. తప్పులను సరిచేసుకుని లోకసభ ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటుతామని ధీమా వ్యక్తం చేశారు. స్థానికంగా ఉన్నటువంటి స్థానిక ప్రభుత్వం మీద ఉన్నటువంటి వ్యతిరేకత వల్లే తాము ఓడిపోయామన్నారు.

# దొండపాడులో ఉద్రిక్తత

**నిరసన తెలుపుతున్న రైతుల అడ్డగింత**



అమరావతి,మే13 : దొండపాడులో ఉద్రిక్తత చోటుచేసుకుంది. శాంతియుతంగా నిరసన తెలుపుతున్న రైతులపై పోలీసులు జులుం ప్రదర్శించారు. శాంతియుతంగా ఆందోళన చేస్తున్న రైతులను బలవంతంగా వాహనంలోకి పోలీసులు ఎక్కించారు. పోలీసుల తీరుపై రాజధాని రైతుల మండిపడు తున్నారు. ఎదురు తిరగకుండానే అరెస్ట్ చేస్తున్నారంటూ రైతులు ఆగ్రహం చేస్తున్నారు. రాజధాని నిర్మాణానికి భూములిచ్చిన రైతులను, అమరావతిని నాశనం చేయడానికే ప్రభుత్వం ఆర్-5 జోన్‌ను తీసుకువచ్చిందని రైతులు, మహిళలు ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పేదలకు సెంటు భూమి పంపిణీ చేయడానికి ప్రభుత్వం మరో 268 ఎకరాలను కేటాయించింది. ఈ క్రమంలో శుక్రవారం పిచ్చుకలపాలెం, నెక్కల్లు, అనంతవరం గ్రామాల్లోని భూముల్లో జంగిల్ క్లియర్ చేయడానికి సీఆర్‌డీఏ ఎక్స్‌కవేటర్లను రంగంలోకి దించింది. విషయం తెలుసుకున్న రైతులు, మహిళలు అక్కడికి చేరుకొని జంగిల్ క్లియర్ పనులను అడ్డుకున్నారు. దొండపాడు సమీపంలో పనులు చేయడాన్ని వ్యతిరేకిస్తూ మహిళలు పెట్రోల్ సీసాలతో ఆందోళనలు చేపట్టారు. చావడానికైనా సిద్ధపడతాం కాని పనులు చేస్తే ఊరుకోబోమని ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసులు అక్కడకు చేరుకున్నారు. మహిళల వద్ద పెట్రోల్ సీసాలను లాక్కోవడానికి తుళ్లూరు సీఐ ఆనందరావు ప్రయత్నించారు. దీంతో సీసాలలోని పెట్రోల్ మహిళలపై పడటంతో పాటు, సీఐ కళ్లలోనూ పడింది. అక్కడే ఉన్న పోలీసులు, రైతులు, మహిళలు అప్రమత్తమై వారిపై కండువాలు కప్పి ప్రమాదం జరగకుండా చూశారు. సీఐ కళ్లలో పెట్రోల్ పడడంతో 108 వాహనంలో ఆస్పత్రికి తరలించారు. కొద్ది సేపటికి మహిళలను కూడా ఆస్పత్రికి తరలించారు. మరోవైపు ఇతర మహిళలు, రైతులు నెక్కల్లు, అనంతవరం గ్రామాల్లో జంగిల్ క్లియర్స్‌ను అడ్డుకున్నారు. పోలీసులు వారించినా వినలేదు. రోడ్డుపై బైఠాయించి ఆందోళనకు దిగారు. రైతులపై పగ, ప్రతీకారాలతోనే సీఎం డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని మండిపడ్డారు. కాగా, దొండపాడులోనూ సీడ్ యాక్సెస్ రోడ్డుపై టెంటు వేసి రైతులు నిరసన వ్యక్తం చేశారు. నెక్కల్లులో జేసీబీలను అడ్డుకున్నారు.

# తుళ్లూరులో 144 సెక్షన్ విధింపు



**అనుమతి లేకుండా ర్యాలీల నిషేధం**

**జడా శ్రావణ్ కుమార్‌ను అడ్డుకున్న పోలీసులు**

**పోటాపోటీగా ఆందోళనకు దిగిన వైసిపి కార్యకర్తలు**



అమరావతి,మే13 : అమరావతి ప్రాంత తుళ్లూరులో పోలీసులు 144 సెక్షన్ విధించారు. అనుమతి లేకుండానే నిరసనలు చేస్తున్నారంటూ జై భీం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు జడా శ్రావణ్ కుమార్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. ఆందోళనల నేపథ్యంలో అమరావతి రాజధాని ప్రాంతం తుళ్లూరులో పోలీసలు అలర్ట్ అయ్యారు. హై సెక్యూరిటి జోన్ పరిధిలో ముందస్తుగా అనుమతులు లేకుండా నిరసనలు, ఆందోళనలు చేపట్టటంపై పోలీసులు అభ్యంతరం తెలిపారు. అంబేడ్కర్ స్మృతివనం వరకు జై భీం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు జడ శ్రావణ్‌కుమార్ పాదయాత్ర తలపెట్టారు. రాజధాని ప్రాంతంలో ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై జడ శ్రవణ్ కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. దళితులను అడ్డంగా పెట్టుకొని రాజధాని భూముల విషయంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ ప్రభుత్వం అమాయకు లను వంచించి మోసగిస్తోందని జడ శ్రవణ్ కుమార్ ఆరోపించారు. అమరా వతి రైతులకు మద్దతుగా పాదయాత్రకు బయలుదేరిన జడా శ్రావణ్ కుమార్ హోటల్ నుంచి బయటకు రాగానే పోలీసులు ఆయన్ని రౌండప్ చేశారు. అనుమతి లేదంటూ అరెస్ట చేసిన పోలీసులు, అక్కడ నుంచి నున్న పోలీస్ స్టేషన్ కు తరలించారు.ప్రభుత్వం, పోలీసులు తీరు పై ఆగ్రహం వ్యక్తం చేసిన జడా శ్రావణ్, వైఫల్యాలు బయట పడతాయనే తమను అరెస్ట్ చేశారని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న దమనకాండకు వ్యతిరేకంగా పాదయాత్ర చేయాలని నిర్ణయించామని చెప్పారు. పాదయాత్రను అడ్డుకుని పోలీసులు అన్యాయంగా అరెస్టు చేశారని, ఆర్ 5 జోన్ పై ప్రభుత్వం దుర్మార్గంతో వ్యవహరిస్తుందన్నారు. రైతులకు మద్దతుగా పాదయాత్ర చేస్తే తప్పేంటిని ప్రశ్నించా రు. జీవో నంబర్ ఒన్ రద్దు చేసినా తనను ఎలా అరెస్టు చేస్తారని జడ శ్రవణ్ అన్నారు. అక్రమ అరెస్టుకు నిరసనగా ఈ క్షణం నుంచి ఆమరణ దీక్షకు దిగుతున్నానని అన్నారు. జైలులో పెట్టినా, ఆస్పత్రిలో ఉన్నా దీక్ష కొనసాగుతుందన్నారు. ఈ అరెస్టుపై సిఎం స్వయంగా స్పందించాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్యమా, రాచరికమా అనేది జగన్మోహన్ రెడ్డి చెప్పాలని, రైతులకు మద్దతు ఇవ్వడం కూడా ఈ ప్రభుత్వంలో నేరమా అని ప్రశ్నించారు. తనకు ఏ విధమైన నోటీస్ ఇవ్వకుండా అరెస్టు చేశారని, నేటి నుంచి జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వానికి కౌంట్ డౌన్ ప్రారంభం అయ్యిందన్నారు. జగన్మోహన్ రెడ్డి దిగి వచ్చే వరకు ఆమరణ దీక్ష కొనసాగుతుందని వెల్లడించారు. పోటాపోటీగా వైఎస్ఆర్ కాంగ్రెస్ ర్యాలీఇదిలావుంటే రాజధాని ప్రాంతంలో జడా శ్రవణ్ పాదయాత్ర చేపట్టిన నేపథ్యంలో ఆయనకు పోటీగా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు కూడా ర్యాలీని తలపెట్టారు. రాజధాని ప్రాంతంలో పేదలకు ఇంటి స్థలాల కేటాయింపుపై హర్షం వ్యక్తం చేస్తూ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి చెందిన నేతలు ర్యాలీకి దిగటంతో పోలీసుల అప్రమత్తం అయ్యారు. ర్యాలీకి అనుమతి లేదని స్పష్టం చేశారు. రెండు నిరసన కార్యక్రమాలు తలపెట్టటంతో పోలీసులు ముందు జాగ్రత్తగా తుళ్ళూరు ప్రాంతంలో 144సెక్షన్ అమలులోకి తీసుకువచ్చారు. వరుస ఆందోళనలు నేపథ్యంలో పోలీసులు ప్రత్యేకంగా చెక్ పోస్ట్ ఏర్పాటు చేశారు. హై సెక్యూరిటీ జోన్‌లో అనుమతి లేకుండా, ఎలాంటి నిరసనలు తలపెట్టినా చర్యలు కఠినంగా ఉంటాయని పోలీసులు హెచ్చరించారు.

# కర్ణాటక ఎన్నికల ఫలితాలపై సిపిఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు

రాజమండ్రి మే 13 బిజెపి హటావో దేశ్ బచావో బిజెపి ను సాగనపుదాం దేశాన్ని కాపాడుకుందాం అని సిపిఐ జాతియ సమితి పిలుపును కర్ణాటక ప్రజలు అమలు చేయడం బిజెపి మతతత్వ రాజకీయాలకు బుద్ధి చెప్పి లౌకికవాదం కాపాడినందుకు కర్ణాటక ప్రజలకు ధన్యవాదములు తెలియజేస్తున్నట్లు సిపిఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు తెలిపారు కర్ణాటక ఎన్నికల ఫలితాలు సందర్భంగా అయన ఒక ప్రకటన విడుదల చేశారు మధు మాట్లాడుతూ ఒక ఎన్నికల సభలో దేశ ప్రధాని జై భజరంగ్ దళ్ పిలుపునిచ్చాడంటే ఈ దేశాన్ని ఆయా రాష్ట్రాలను బిజెపి ఎటువైపు తీసుకెళ్తుందో కర్ణాటక ప్రజలు అర్థం చేసుకున్నారని ఆయన అన్నారు భారత రాజ్యాంగం ,ఫెడరల్ లౌకిక వ్యవస్థ పై ప్రమాణం చేసి పాలిస్తున్న మోడీ ఉగ్రవాదులతో సమానమైన జై భజరంగ్ దళ్ ను కీర్తించడం కర్ణాటక ప్రజలు అసహ్యించుకున్నారని మధు తెలిపారు కర్ణాటక ఎన్నికల ఫలితాలు చూసిన చూసైనా జగన్ చంద్రబాబు పవన్ మారాలని మధు కోరారు ప్రత్యేక హోదా విషయంలో కాకినాడ సభలో ఆనాడు పవన్ కళ్యాణ్ పాచిపోయిన లడ్డు ఇస్తారా అడిగి నేడు ఆ పాచిపోయిన బిజెపితో అంటకలపడం దారుణం అన్నారు పవన్ కళ్యాణ్ కు యువత పెద్ద ఎత్తున ఫాలోయింగ్ ఉందని ఒక సామాజిక వర్గం ఆయనతో ఉందని అటువంటి పవన్ కళ్యాణ్ బిజెపి వ్యతిరేకంగా పోరాట చేయకపోవడం దారుణం అన్నారు రాష్ట్రంలో ఐదు కోట్ల ప్రజల ఆకాంక్షలను నాశనం చేస్తున్న బిజెపితో వచ్చే ఎన్నికల్లో పొత్తు ఉంటామని పవన్ కళ్యాణ్ చెప్పడం దుర్మార్గం అన్నారురాష్ట్రానికి తీవ్ర అన్యాయం చేస్తున్నా కేంద్రంపై జగన్మోహన్ రెడ్డి నోరు మెదపకపోవడం అన్యాయం అన్నారు పార్లమెంట్ సీట్లు ఎక్కువ స్థానాలు ఇస్తే రాష్ట్ర హక్కులపై మోడీ మెడ వంచితానని చెప్పిన జగన్ తాను మెడలు వంచి వంగి వంగి మోడీకి దండం పెట్టడం సరిపోతుందన్నారు గతంలో మోడీ వల్ల దేశం తిరోగమనవైపు వెళుతుందని చెప్పిన చంద్రబాబు నేడు వచ్చే ఎన్నికల్లో తన అవకాశవాద రాజకీయాల కోసం మోడీ విజనరీ బాగుందని చెప్పడం హాస్యాస్పదంగా ఉందని మధు అన్నారు కావున ఈ ముగ్గురు నేతలు కర్ణాటక ప్రజలను చూసి బుద్ధి తెచ్చుకుని రాష్ట్ర హక్కుల కోసం విశాఖ ఉక్కు పరిరక్షణ కోసం ప్రత్యేక హోదా కోసం కమ్యూనిస్టులతో కలిపి పోరాటానికి సిద్ధం కావాలని మధు పిలుపునిచ్చారు

## కె.తిమ్మాపురం గ్రామంలో జనసేన పార్టీ ఆధ్వర్యంలో గిరక బండ్ల పోటీలు



ఎమ్మిగనూరు మే 13......... వి భారే న్యూస్శ్రీశ్రీశ్రీ మహాయోగి లక్ష్మమ్మ జాతర సందర్భంగా ఎమ్మిగనూరు మండలం కే తిమ్మాపురం గ్రామంలో జనసేన పార్టీ ఆధ్వర్యంలో గిరక బండ్ల పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మిగనూరు నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ జె. రేఖ హాజరై ఎడ్లబండ్ల పొట్టీలను ప్రారంభించారు. అంతకుముందు తిమ్మాపురం గ్రామ జనసైనికులు ఆమెకు కు ఘనస్వాగతం పలికారు. ఈ పోటీల్లో గెలుపొందే ఎద్దులకు మొదటి బహుమతి 20116/- రెండవ బహుమతి 15116/- రూ మూడవ బహుమతి 10116/- రూ నాల్గవ బహుమతి 5116/- రూ అందిచనునట్లు కమిటీ నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు బజారి, తిమ్మాపురం గ్రామ జనసైనికులు నాయకులు కర్ణం రవి. షబ్బీర్, మునిస్వామి, రాజు, తదితరులు పాల్గొన్నారు.

## పారిశుధ్య నిర్వహణపై నిర్లక్ష్యం వద్దు



నంద్యాల మా ప్రతినిధి మే13. విభారె న్యూస్ : స్థానిక పట్టణంలో శనివారం నాడు నంద్యాల మున్సిపల్ కమిషనర్ రవి చంద్రా రెడ్డి హెల్త్ ఆఫీసర్ అంకిరెడ్డి. శానిటేషన్ సూపరైజర్ లక్ష్మినారాయణ. శివ ప్రసాద్ రెడ్డి తో కలసి స్థానిక విశ్వనగర్ పరిసర ప్రాంతాల్లో పారిశుధ్య నిర్వహణను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పారిశుధ్య నిర్వహణ ఎక్కడ ఆలసత్వం ప్రదర్సించ వద్దని సూచించారు. సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఆఫీసర్ అంకిరెడ్డి. శానిటేషన్ సూపరైజర్ లక్ష్మినారాయణ. శివ ప్రసాద్ రెడ్డి. మున్సిపల్ సిబ్బంది . సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు..

## శ్రీ సుదర్శన శిఖర కలశ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే.





ఎమ్మిగనూరు మే 13 విభారె న్యూస్.పట్టణంలోని 18 వ వార్డు (పాత 11వ వార్డు) లో వెలసిన శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయంలో జరుగుతున్న శ్రీ సుదర్శన శిఖర కళాశ ప్రతిష్టాపన కార్యక్రమం నకు ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన దేవాలయాన్ని సందర్శించి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి నాయకులు, కార్యకర్తలు, కౌన్సిలర్లు, ఇన్చార్జ్ లు, దేవాలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## బిజేపీ ఎం.పి దిష్టి బొమ్మ దగ్ధం

విశాఖపట్నం,ఆర్టీసీ కాంప్లెక్స్ గురజాడ విగ్రహం వద్ద మహిళా రెజ్లర్ల పోరాటానికి సంఘీభావంగా ఏపీ మహిళా సమాఖ్య , అఖిల భారత యువజన సమాఖ్య , అఖిల భారత విద్యార్థి సమాఖ్యల అధ్వర్యంలో రెజ్లర్ల ఫెడరేషన్ అధ్యక్షుడు బ్రిజ్ భూషణ్ చరణ్ సింగ్ దిష్టి బొమ్మ ను దగ్ధం చేశారు. భారత దేశానికి స్వర్ణ, సిల్వర్ పతకాలు సాధించిన మహిళా రెజ్లర్లు లను ఉత్తరప్రదేశ్ ఎం.పి డ రెజ్లర్ల ఫెడరేషన్ అధ్యక్షుడు బ్రిజ్ భూషణ్ చరణ్ సింగ్ లైంగిక వేదింపులకు పాల్పడుతున్నాడని ప్రధానికి, క్రీడా రంగానికి సంభదించిన అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోకపోవటం తో ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద 18రోజుల నుంచి ఆందోళన కొనసాగిస్తూ న్యాయం కోసం పోరాటం చేస్తున్నా వారిపై ఢిల్లీ పోలీస్ వారు మద్యం సేవించి వారిపై దాడులు చేయటం హేయమైన చర్యగా ఏపీ మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి అత్తిలి విమల అభివర్ణించారు. అలాగే బిజేపీ అదికారంలోకి వచ్చినప్పటి నుంచి దేశంలో మరియు బిజెపి పాలిత రాష్ట్రాల్లో ఆర్. ఎస్ ఎస్ , విశ్వహిందూ పరిషత్ , బిజెపి ప్రతినిధులు మహిళలపై లైగింక దాడులు,హత్యలు విపరీతంగా పెరిగాయని ఆగ్రహం వ్యక్తం చేశారు.

# కర్ణాటకలో కాంగ్రెస్ పార్టీ గెలుపు- నంద్యాల లో సంబరాలు



### పిసిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ చింతల మోహన్ రావు

నంద్యాల మా ప్రతినిధి మే 13 విభారె న్యూస్ :-నంద్యాల పట్టణ అధ్యక్షులు దాసరి చింతలయ్య ఆధ్వర్యంలో కర్ణాటక రాష్ట్ర శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 224 స్థానాలకు గాను ప్రభుత్వ ఏర్పాటుకు కావాల్సిన 113 సీట్లకు పైగానే విజయ దుందుభి మోగించింది. ఈ సందర్భంగ నంద్యాల పార్టీ ఆఫీసులో బాణసంచా కాల్చి స్వీట్లు పంపిణీ చేసి కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు ఊరేగింపుగా వెళ్లి నూనెపల్లె సర్కిల్ నందు శ్రీనివాస సెంటర్ మీదుగా గాంధీ చౌక్ కు వెళ్లి కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున బాణసంచారాలను కాల్చి ప్రజలకు మిఠాయిలు పంచిపెట్టి విజయోత్సవ సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా మీడియా వారితో పిసిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ చింతల మోహన్ రావు ఈ విధంగా మాట్లాడారు... కర్ణాటక రాష్ట్ర ప్రజలు ఎంతో విజ్ఞత కలిగిన వారు అభివృద్ధిని, సంక్షేమాన్ని ఇచ్చే కాంగ్రెస్ పార్టీని చూసి పెద్ద ఎత్తున ఓట్లు వేసి కర్ణాటక ప్రజలు కాంగ్రెస్ పార్టీని గెలిపించారు. వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఎన్నికల ముందు నరేంద్రమోడీ , అమిత్ షా లు మతతత్వంతో ఓట్లు రాబట్టాలని, అధికారం చేపట్టాలని ఎన్ని కుట్రలు చేసినా ప్రజలు మాత్రం అభివృద్ధికె ఓటు వేశారు. ఇది మత రాజకీయాలకు వ్యతిరేకంగా ఇచ్చిన తీర్పు. రానున్న తెలంగాణ, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, రాజస్థాన్ తదితర రాష్ట్రాలలో జరగబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పిసిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ చింతల మోహన్ రావు, పీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఉకొటు వాసు, పట్టణ అధ్యక్షులు దాసరి చింతలయ్య, ఎస్సీ సెల్ స్టేట్ కోఆర్డినేటర్ కరాటే బాలకృష్ణ, సేవ దళ రాష్ట్ర కార్యదర్శి మస్తాన్ ఖాన్, బీసీ సెల్ నంద్యాల జిల్లా అధ్యక్షులు సంపంగి రామకృష్ణ, జిల్లా కోశాధికారి ఎస్ వై డి ప్రసాద్, మైనార్టీ నాయకులు చాబోలి సలాం, ఐ ఎన్ టి సి నాయకులు ఆర్టీసీ ప్రసాద్, జిల్లా ఉపాధ్యక్షుడు పాస్టర్ పాల్ రాజ్, యూత్ కాంగ్రెస్ నాయకులు పసుపుల అజయ్ కుమార్, కృష్ణ బండి ఆత్మకూరు మండల అధ్యక్షుడు జజ్జన రవిబాబు, మైనార్టీ సీనియర్ నాయకులు పాల మహబూబ్ తదితరులు పాల్గొన్నారు

# 1 కోటి 35 లక్షల తో సలీంనగర్ శ్యాంనగర్ నూతన బ్రిడ్జి



### - ప్రారంభించిన ఎమ్మెల్యే. ఎమ్మెల్సీ

నంద్యాల మా ప్రతినిధి మే :-13 విభారె న్యూస్ :-నంద్యాల పట్టణంలోని 35 వార్డు సలీంనగర్లో 1కోటి 35 లక్షల రూపాయలతో నూతన బ్రిడ్జిని ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి ఎమ్మెల్సీ ఇషాక్ బాషా మున్సిపల్ చైర్ పర్సన్ మాబునిస మున్సిపల్ కమిషనర్ రవిచంద్ర రెడ్డి వార్డు కౌన్సిలర్ చింపింగ్ బాష ప్రారంభించారు ఎంతోకాలంగా సరూర్నగర్ శ్యాంనగర్ ప్రజలు ఎన్నో ఇబ్బందులు పడేవారని వైఎస్ఆర్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నంద్యాల పట్టణంలోని చామకాలు బ్రిడ్జిలను పూర్తిచేసిన ఘనత వైఎస్ఆర్ ప్రభుత్వానికి దక్కిందని అక్కడి ప్రజలు ఎంతో సంతోషంతో ఎమ్మెల్యే శిల్ప రవి రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా నంద్యాల శాసనసభ్యులు శిల్ప రవిచంద్ర కిషోర్ రెడ్డి మాట్లాడుతూ సలీం నగర్ శ్యామ్ నగర్ నూతన బ్రిడ్జిని 1కోటి 35 లక్షల రూపాయలతో పూర్తి చేసి ఈ ప్రాంత ప్రజలకు సౌకర్యవంతంగా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. మరి తెలుగుదేశం నాయకులు నోరు తెరిస్తే అంతా మేమే చేశామని చెప్పుకోవడం పొరపాటుగా మారిందని వాళ్ళు చేయని వాటి ముందర కూడా సెల్ఫీలు దిగి ఫేస్బుక్ లో ఫోటోలు పెట్టే పరిస్థితికి వచ్చారు అలాగే కొన్ని సందర్భాలలో సెల్ఫులు దిగిన ఫోటోలు డిలీట్ చేసే పరిస్థితికి వచ్చారంటే వాటిని బట్టి వాళ్ళు చేశారా చేయలేదా అని వారి అంతరాత్మకే తెలుసు అన్నారు. ఈరోజు ఈ బ్రిడ్జి ప్రతి రూపాయి మన ప్రభుత్వం చెల్లించి మనం ప్రారంభించడం ఎంతో సంతోషంగా ఉందని అలాగే ఇక్కడ కూటి ఏడు లక్షల రూపాయలతో త్వరలో అర్బన్ హెల్త్ సెంటర్ ను ప్రారంభించడం జరుగుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ పాంశావలి మార్కెట్ యార్డ్ చైర్మన్ మహేశ్వర్ రెడ్డి. మున్సిపల్ కమిషనర్ రవి చంద్రా రెడ్డి. హెల్త్ ఆఫీసర్ అంకిరెడ్డి. ఎమ్ ఈఈ రమణ మూర్తి. డీఈఈలు జయ భారత్ రెడ్డి. మదు కుమార్. శ్రీనివాసులు రెడ్డి ,వార్డు వైసిపి నాయకులు మాజీ కౌన్సిలర్ మహబూబ్ బి, పెద్ద మౌలాలి ,అత్త ఉల్లా, చింపింగు రెహమాన్, ఏకే ఖాన్, మరియు మున్సిపల్ కౌన్సిలర్ కోఆప్షన్ సభ్యులు మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

# కర్ణాటక రాష్ట్రంలోనూ కాంగ్రెస్ పార్టీ గెలవడం బిజెపి పార్టీకి చెంపపెట్టు లాంటిది.



మంత్రాలయం మే 13 విభారె న్యూస్.జై భీమ్ ఎమ్మార్పీఎస్ కర్నూలు జిల్లా కన్వీనర్ గందాలం మణికుమార్ మాదిగ ఆధ్వర్యంలో స్థానిక ప్రైవేట్ లాడ్జి నందు విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి ఈ సందర్భంగా జై భీమ్ ఎమ్మార్పీఎస్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు చిక్కం జానయ్య మాదిగ మాట్లాడుతూ కర్ణాటక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 136 సీట్లు గెలుచుకొని అధికారం చేపట్టినందుకు బిజెపి పార్టీకి ఒక చెంప పెట్టులాంటిది.బిజెపి పార్టీ 64 సీట్లు, జెడిఎస్ పార్టీ 20 సీట్లు, ఇతరులు 4 సీట్లు వచ్చాయి.

### - ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు చిక్కం జానయ్య మాదిగ.

కర్ణాటక ఎన్నికల్లో మందకృష్ణ మాదిగ బిజెపి పార్టీ నుంచి ప్రచారం చేయడం సిగ్గుచేటు ఎందుకంటే బిజెపి పార్టీ మతతత్వ పార్టీ,ఎస్సీ వర్గీకరణను వంద రోజుల్లో చేస్తానని మోసం చేసిన పార్టీ అటువంటి పార్టీకి మంద కృష్ణ మాదిగ సపోర్ట్ చేసి మరలా మాదిగలను మోసం చేశారని దుయ్యబట్టారు. ప్రపంచవ్యాప్తంగా అతి పెద్ద గ్రంథంగా డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ రాజ్యాంగాన్ని రచించి, భారతదేశంలో భారత రాజ్యాంగం ద్వారా నడిచే ప్రజాస్వామ్యాన్ని కూల్చాలని బిజెపి ప్రభుత్వం చూస్తుంది. అదేవిధంగా రాజ్యాంగాన్ని మార్చాలని చూస్తూ, ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ చట్టానికి తూట్లు పొడుస్తూ,అందరి హక్కులకు భంగం కలిగిస్తున్న బిజెపి పార్టీకి కర్ణాటక ఓటర్లు స్వస్తి పలకడం హర్షనీయమని మాట్లాడి, మాదిగ జాతిని బిజెపి మతతత్వ పార్టీకి తాకట్టు పెట్టిన మందకృష్ణ మాదిగ ఆటలు ఆంధ్రప్రదేశ్ లో సాగనివ్వమని, రోబోయే రోజుల్లో ఆంధ్రప్రదేశ్ లో మాదిగలకు రాష్ట్ర ప్రభుత్వం ఎస్సి వర్గీకరణ చేయలేకపోతే కర్ణాటక ఓటర్లు లాగ బుద్ధి చెపుతామని మాట్లాడడం జరిగింది.ఈ కార్యక్రమంలో జై భీమ్ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కోఆర్డినేటర్ రంగస్వామి,మంత్రాలయం మండల అధ్యక్షుడు నరసింహులు, ఎమ్మిగనూరు మండల అధ్యక్షుడు పెద్ద ముష్టి అబ్రహం, తదితరులు పాల్గొన్నారు.

# శ్రీరామ నామ లిఖిత జప యజ్ఞము నందు బృహత్తర ఘట్టము.



ఎమ్మిగనూరు మే 13 విభారె న్యూస్.శ్రీరామ నామ లిఖిత జప యజ్ఞమునందు శనివారము ఎంతో ముఖ్యమైన ఘట్టము చోటు చేసుకున్నదని ఆ అయోధ్య రామచంద్ర వారి సన్నిధికి రామకోటి పుస్తకాలు చేరి ఆ రామచంద్ర ప్రభుల వారి పాదాల జెంత ఉంచి పూజా కార్యక్రమాలు నిర్వహించి హనుమంతుని వద్ద కూడా పూజలు నిర్వహించడం జరిగినదని, సరయు నది తీరంలో ఆవోపా అసోసియేట్ మెంబర్ వాసవి సేవాదల్ అధ్యక్షుడు పాలూరు కిషోర్ కాశీ నుంచి అయోధ్యకు వెళ్లి పుస్తకములను రామచంద్ర ప్రభు వారి వద్ద ఉంచి పూజ జరిపించడం జరిగినదని, అదేవిధంగా పుస్తకాలను అయోధ్యలో ప్రదర్శించడం,శ్రీరామ నామ కోటి పుస్తకాలను భద్రాచలంలో ఒంటిమిట్టలో అయోధ్యలో ఇప్పటివరకు పూజ జరిపించుకున్న అందుకు ఎంతో ధన్యులైనామని తెలియజేస్తూ సభ్యులందరూ రామకోటి పుస్తకాలను త్వరగా పూర్తిచేసి ఆరు నెలల వ్యవధిలోగా అవోపా కార్యాలయమునకు చేర్పించినచో వాటిని అయోధ్యకు చేర్పించే బృహత్తర కార్యక్రమం చేపట్టేదమని అని అవోపా సంఘ సభ్యులు సభ్యులందరికీ తెలియజేశారు.

# 2024 ఎన్నికల్లో నడిగడ్డ మాదే నంద్యాల మాదే

### శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి ఎమ్మెల్యే



నంద్యాలనంద్యాల మా ప్రతినిధి మే 13 విభారె న్యూస్ :- నంద్యాల పట్టణంలో శనివారం నాడు ఉదయమే గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం లో ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి మాట్లాడుతూ 2024 ఎన్నికల లో నడిగడ్డ మాదే నంద్యాల మాదే గెలుపు ఖాయమని ఆయన అన్నారు . 5 వార్డు నదిగడ్డలో కౌన్సిలర్ ఆరిఫ్ నాయక్ ఆధ్వర్యంలో 103 వ రోజు గడపగడపకు మా ప్రభుత్వం కార్యక్రమంలో శాసనసభ్యులు శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి మరియు ఎమ్మెల్సీ ఇషాక్ భాషా పాల్గొని వార్డులో ఉన్న ప్రతి గడపను తాకుతూ సంక్షేమ పథకాల కరపత్రాలను లబ్ధిదారులకు అందించారు. వైఎస్ఆర్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రతి సంక్షేమ పథకం ఇంటి వద్దకే వస్తున్నాయని ప్రజలు అంటున్నారని తెలిపారు. నంద్యాల నియోజకవర్గంలో వైయస్సార్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సంక్షేమ అభివృద్ధికి పెద్ద పీట వేస్తూ అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రజలు చిన్న చిన్న సమస్యలను మా దృష్టికి తీసుకురావడం జరిగిందని ముఖ్యంగా డ్రైనేజీ ఎలక్ట్రికల్ సమస్యను తెలిపారని వాటిని అక్కడే ఉన్న అధికారులకు తెలిపి వెంటనే పరిష్కరించాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ మాబున్నిషా. మున్సిపల్ వైస్ చైర్మన్ పామ్ షావలి. మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ వెంకట దాస్ , కౌన్సిలర్లు శాదిక్ భాష,సమ్మద్,తబ్రేజ్, మాజీ కౌన్సిలర్ అనిల్ అమృతరాజ్ మరియు వార్డు వైసిపి నాయకులు ప్రభుత్వ అధికారులు సచివాల సిబ్బంది వాలంటీర్లు పాల్గొన్నారు.

# ప్రధానమంత్రి మోదీ, అమిత్ షా లు రాజీనామా చేయాలి

### డిమాండ్ చేసిన ప్రజాస్వామ్య లౌకిక ఐక్యవేదిక



నంద్యాల మా ప్రతినిధి మే 13 విభారె న్యూస్ :-ప్రజాస్వామ్య లౌకిక ఐక్యవేదిక" కన్వీనర్, ఎస్.ఎం.డి అబుల్ లైస్ అధ్యక్షతనతో శనివారం నాడు ,నంద్యాల లోని స్థానిక ఆవాజ్ కమిటీ కార్యాలయంలో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో కర్ణాటక రాష్ట్రంలో జరిగిన శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘనవిజయం సాధించినందుకు వక్తలందరూ తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ రాహుల్ గారి ప్రేమ సందేశం గెలిచిందని మోడీ గారి విద్వేషం ఓడిపోయిందని, కాబట్టి మతాల మధ్య కులాల మధ్య చిచ్చు పెట్టడానికి శతవిధాల ప్రయత్నం చేసిన మోడీ, అమిత్ షా లు దీనికి నైతిక బాధ్యత వహిస్తూ తమ పదవులకు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కన్నడిగులు కులమతాలకు అతీతంగా లౌకికవాదానికి ప్రజాస్వామ్యానికే పట్టం కట్టారని వారి ఈ నిర్ణయాన్ని భారతదేశమంతా స్వాగతిస్తుందని అభిప్రాయపడ్డారు. భవిష్యత్తులో కూడా ప్ర. లౌ. ఐ. వే ఇదేవిధంగా కులమతాలకు అతీతంగా సమస్యలపై పోరాడుతుందని అన్నారు. ఈ కార్యక్రమం లో బిషప్ డాక్టర్ ఎల్ మరియా రాజ్ భాస్కర్, పాస్టర్ జానయ్య మన్నెం, క్రిస్టియన్ జేఏసీ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు, ఎస్ అబ్దుల్ సమద్, జమాత్ ఎ ఇస్లామి నంద్యాల జిల్లా అధ్యక్షు లు, మస్తాన్వలి ఆవాజ్ జిల్లా ప్రధాన కార్యదర్శి, మౌలానా ఖలీల్ సంగమి జమీ అతే ఉలేమా రాష్ట్ర కన్వీనర్, బాబా ఫక్రుద్దీన్, ఇన్సాఫ్ పార్టీ రాష్ట్ర కన్వీనర్,ఎస్. బాబుల్లా నంద్యాల టౌన్ ఆవాజ్ ప్రెసిడెంట్, మస్తాన్ ఖాన్ రాష్ట్ర సేవాదళ్ , కాంగ్రెస్, ఎం సుధాకర్, వికలాంగుల స్టేట్ కన్వీనర్, ప్రభు, క్రిస్టియన్ జేఏసీ ,మౌలానా రహమతుల్లా , సయ్యద్ అబ్దుల్ మునీర్ అల్ మేవా, మొదలగువారు పాల్గొన్నారు.

## పవన్ కళ్యాణ్ ముఖ్యమంత్రి అయితేనే నిరుపేదలకు మంచిది

పిఠాపురం నిరుపేదలకు మంచి జరగాలన్న రాష్ట్ర అభివృద్ధి చెందాలి అన్న పవన్ కళ్యాణ్ లాంటి సమర్థుడు అయిన వ్యక్తులు ముఖ్యమంత్రి అయితేనే జరుగుతాయని పిఠాపురం నియోజకవర్గం జనసేన నాయకులు డాక్టర్ పిల్లా శ్రీధర్ తెలియజేశారు పవన్ రావాలి పాలన మారాలి అనే నినాదంతో జనసేన అధినేత పవన్ కళ్యాణ్ 2024లో ముఖ్యమంత్రి అవ్వాలని దేవుడిని ప్రార్థిస్తూ పిఠాపురంలో పిఠాపురం నియోజకవర్గం జనసేన నాయకులు డాక్టర్ పిల్లా శ్రీధర్ ఆధ్వర్యంలో పిఠాపురం ప్రముఖ పుణ్యక్షేత్రమైన పాదగయ క్షేత్రం నుండి తొలి తిరుపతి వరకు పవన్ కోసం పాదయాత్ర కార్యక్రమాన్ని చేపట్టారు ముందుగా డాక్టర్ పిల్లా శ్రీధర్ డాక్టర్ పిల్లా దీపిక దంపతులు జనసేన కార్యకర్తలు వీర మహిళతో కలిసి పాదగయ క్షేత్రంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు స్వయంభు దత్తాత్రేయ స్వామి వారికి పురుహూతిక అమ్మవారికి కుక్కుటేశ్వర స్వామి వారికి పూజలు నిర్వహించారు అనంతరం పాదగయ క్షేత్రం నుండి భారీ ర్యాలీగా డాక్టర్ పిల్లా శ్రీధర్ పవన్ కోసం పాదయాత్ర ప్రారంభించారు పిఠాపురం పట్టణం కుమారపురం.కందరాడ. ఈ.ఐ.పాలెం. మీదుగా విరవాడ. విరవ. తదితర గ్రామాలు మీదుగా ఈ పాదయాత్ర కొనసాగింది దారి పొడవునా గోవింద నామ స్మరణతో మారు మోగింది పవన్ కళ్యాణ్ జిందాబాద్ అనే నినాదాలతో పాదయాత్ర కొనసాగింది దారి పొడవునా డాక్టర్ పిల్లా శ్రీధర్ కు డాక్టర్ పిల్లా దీపికకు వీరమహిళలు. హారతులు ఇస్తూ స్వాగతాలు పలికారు

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2, OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL - 518 001. ANDHRA PRADESH.
PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY, 7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190